పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు
రంగం సిద్ధం
గ్రామాల్లో గుర్తించాక అక్కడే సభ
ఆపై జిల్లా గెజిట్‌లో ప్రచురణ

చిత్తూరు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణకు రంగం సిద్ధమైంది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ చర్యలు మొదలుపెట్టింది. అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది.

మూడు కేటగిరీలుగా..

జిల్లాలో 697 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలోని ఆస్తుల గుర్తింపును మూడు కేటగిరీలుగా విభజించారు. అందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. కేటగిరీ-ఏలో రోడ్లు, డ్రైన్లు, బందెలదొడ్లు తదితర అంశాలు ఉన్నాయి. కేటగిరీ-బీలో పంచాయతీలకు దాతలు ఇచ్చిన ఆస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని గుర్తించాలి. కేటగిరీ-సీలో వాటర్ ట్యాంకులు, ఊటచెరువులు, చెరువులు, సూక్ష్మనీటి పారుదల, పొరంబోకు, శ్మశాన స్థలాలను గుర్తించి నోటీసు బోర్డులు పెట్టాలి. తదనంతరం ఆయా స్థలాలపై పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేయాలి. ఇంకా ఏమైనా ఆస్తులున్నాయా అన్నది చర్చించి.. అలాంటివి కూడా పొందుపరిచి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి నివేదిక పంపాలి. అధికారులు వాటిని పరిశీలించి కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంటుంది. తదనంతరం జిల్లా గెజిట్‌లో ప్రచురిస్తారు.



చిత్తూరు బజారు వీధిలో గంగజాతర నిర్వహణకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

చిత్తూరు గంగ జాతరకు
తరాల చరిత్ర
● 13,14 తేదీల్లో నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

చిత్తూరు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఏటా వైశాఖ మాసంలో చిత్తూరులో నిర్వహించే నడి వీధి గంగమ్మ జాతరకు తరాల చరిత్ర వుంది.భక్తులు ఎంతో నిష్టతో అమ్మవారికి పొంగళ్ళు పొంగించి అంబలిని నైవేద్యంగా సమర్పిస్తారు.జాతర చాటింపు వేశాక దూర ప్రాంతాలకు వెళ్లడం మానేస్తారు. పూర్వకాలంలో చిత్తూరు కుగ్రామంగా వున్నప్పుడు ఒక వేసవి కాలంలో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు అధిక సంఖ్యలో చనిపోయారు.అప్పటి గ్రామపెద్దలందరూ కలిసి ఇందుకు గ్రామ దేవత గంగమ్మ ఆగ్రహమే కారణమని భావించి జాతర నిర్వహణతో ఆమెను శాంతింపజేయాలని తీర్మానించారు. ఊరంతా వేపమండలు కట్టి, ఇంటింటా ముందర పసుపునీళ్ల కల్లాపు చల్లి రోజుకొక అలంకారంతో గంగమ్మకు ఆరు రోజుల పాటు పూజలు చేసి ఏడవ రోజు జాతర మహోత్సవం నిర్వహించారు.తరువాత అంటు రోగాలు నశించి , సమృద్ధిగా వర్షాలు కురవడంతో అప్పట్నుంచీ ఏటా మే నెలలో గంగజాతర నిర్వహిస్తున్నారు.తరాలుగా గంగజాతరను రెడ్డి, కరుణీకర్ సామాజికవర్గాలు నిర్వహిస్తుండగా, చాకలి, బెస్త, కుమ్మరి కులస్తులు మిరాశీదారులుగా వ్యవహరిస్తున్నారు.జాతర ఉత్సవాలను ప్రస్తుతం వంశపారంపర్య ధర్మకర్త సీకే బాబు కుటుంబ సభ్యులతో పాటు హేమంత్‌కుమార్ వంశస్థులు నిర్వహిస్తున్నారు. వైశాఖ మాసంలో చివరి మంగళవారం ముందు మంగళవారం చాటింపు కార్యక్రమం నిర్వహిస్తారు.నగరవాసులంతా ఇళ్ల ముందర వేపమండలు కట్టి రోజూ ఇంటి ముందర పసుపు నీళ్ళు కల్లాపు చల్లి అమ్మవారికి పొంగళ్ళు పెట్టి అంబలి నైవేద్యంగా సమర్పిస్తారు. చివరి రోజు అమ్మవారికి జంతుబలులిచ్చి, మహా కుంభంతో ఘనంగా జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నగరంలో ప్రతి ఇల్లూ బంధువుల సందడితో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది.మరుసటి రోజు అమ్మవారిని మేళతాళాలతో ఊరేగిస్తూ కట్టమంచి చెరువులో జల ప్రవేశం చేయించడంతో జాతర ముగుస్తుంది.గంగమ్మ ఊరేగింపులో వీపులకు కొక్కీలు గుచ్చుకుని క్రేన్ల ద్వారా పూలమాలలు సమర్పించే ఓం శక్తి భక్తుల విన్యాసాలు ఆకట్టుకుంటాయి.అలాగే గాన కచ్చేరి తదితర సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి. గతంలో చిత్తూరులో నడి వీధి గంగజాతర బజారు వీధిలో మాత్రమే జరిగేది. రాన్రానూ గిరింపేట, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, మురకంబట్టు, సంతపేట, తేనెబండ, ప్రశాంత్ నగర్, మంగసముద్రం,ఎస్టేట్ ప్రాంతాల్లో ప్రజలు అమ్మవారి జాతరను నిర్వహించుకుంటున్నారు. ఈ నెల 13, 14తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతరకు బజారు వీధిలో చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు.అమ్మవారికి భక్తితో సమర్పించే అంబళ్ల పోయడానికి దాదాపు 12పెనాలు ఏర్పాటు చేశారు.గంగజాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి మున్సిపల్, పోలీసు శాఖలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



నడివీధి గంగమ్మ మూలవర్లు

నిత్యావసరాల కృత్రిమ కొరత సృష్టిస్తే
కఠిన చర్యలు : డీఎస్వో



హోల్‌సేల్ డీలర్లతో సమావేశమైన డీఎస్వో శంకరన్

చిత్తూరు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులను నిల్వ చేసుకుని, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై పౌరసరఫరాల చట్టం మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్వో శంకరన్ హెచ్చరించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో శనివారం సాయంత్రం తన కార్యాలయంలో నిత్యావసర సరుకుల హోల్‌సేల్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నిత్యావసర కొరత ఉందంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని చెప్పారు. అవసరానికి మించి ఆహార పదార్థాల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ట్రేడర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అలాగే ధరలను నిత్యం పర్యవేక్షిస్తుంటామన్నారు. దుకాణాల ఎదుట సరుకుల ధరలు, నిల్వలను బోర్డుల్లో రోజూ నమోదు చేయాలని సూచించారు. ప్రజలు కూడా సరుకులు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి
3 గంటలు



ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మే 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి ఆదివారం జిల్లా నలుమూల నుంచి వేల సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. రూ.100, రూ.150 క్యూలైన్లు నిండి ఆలయం వెలుపలకు వ్యాపించాయి. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించేలా ఈవో పెంచలకిషోర్ చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీటిని ఆలయ సిబ్బంది అందజేశారు.





చిత్తూరులో మాజీ సైనికుల ర్యాలీ - సీఎస్‌సీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాల ప్రదర్శన

సిందూర్‌కు మద్దతుగా

చిత్తూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): అవసరమైతే మళ్లీ యుద్ధ భూమికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని మాజీ సైనికులు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించడానికి ఇప్పటికీ సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత సైనికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. యావత్తు దేశం సైనికుల వెంట ఉందని అన్నారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి ర్యాలీని ప్రారంభించి ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద ఉన్న అమరజవాన్ స్థూపం వద్ద ముగించారు. ఈ ర్యాలీలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు, మాజీ సైనికుల సంఘం నాయకులు రామచంద్ర, పళని, సురేంద్రబాబు, హరికృష్ణారెడ్డి, శేఖర్, స్థానికులు పాల్గొన్నారు. ● సీఎస్‌సీడీఎస్ (చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలోనూ గాంధీ విగ్రహం వద్ద భారతసేనకు మద్దతుగా నినాదాలు చేశారు. అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండవమూర్తి, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో మహిళలకు ప్రోత్సాహం
82తృప్తి క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యం



- ఒక్కోదానికి నలుగురు చొప్పున 328మందికి ఎదిగే అవకాశం
- మరింతమందికి పరోక్ష ఉపాధి

చిత్తూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మహిళల్ని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఏటా లక్షమంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామని సీఎం చంద్రబాబు ఇదివరకే హామీ ఇచ్చారు. అందులో భాగంగానే మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు నిర్వహించేలా తృప్తి క్యాంటీన్లను ప్రవేశపెట్టారు. విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టులుగా ప్రవేశపెట్టగా.. నెల్లూరులో ఇటీవల తృప్తి క్యాంటీన్‌ను ప్రారంభిచారు. మన జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాల్లోనూ 82 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి మున్సిపాలిటీల్లో 7,953 స్వయం సహాయక పొదుపు సంఘాలుండగా..81,700 మంది సభ్యురాళ్లున్నారు. నలుగురు సభ్యురాళ్లను ఓ యూనిట్‌గా ఏర్పాటు చేసి తృప్తి క్యాంటీను అప్పగిస్తారు. దీనిని నడిపేందుకు 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం అందిస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. వంటలు కూడా ఎలక్ట్రిక్ పరికరాలపై చేయనున్నారు.

● నాలుగు విడతల్లో 82 క్యాంటీన్లు..

ఈ ఏడాది జూన్‌లోగా చిత్తూరులో రెండు, మిగిలిన మున్సిపాలిటీల్లో ఒక్కోటి చొప్పున మొత్తం 6 క్యాంటీన్లను డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే సెప్టెంబరులోగా చిత్తూరులో 12, మిగిలిన మున్సిపాలిటీల్లో 3 చొప్పున మొత్తం 24... డిసెంబరులోగా చిత్తూరులో 13, నగరిలో 4, మిగిలిన చోట 3 చొప్పున మొత్తం 26... మార్చిలోగా చిత్తూరులో మరో 13, నగరిలో 4, మిగిలినచోట 3 చొప్పున మొత్తం 26 క్యాంటీన్లు ఏర్పాటుచేయాలని లక్ష్యం పెట్టుకన్నారు. 2026 వ ఆర్థిక సంవత్సరంలోగా జిల్లావ్యాప్తంగా 82 తృప్తి క్యాంటీన్లు పనిచేస్తుండాలి.

● 75 శాతం మహిళలదే పెట్టుబడి

క్యాంటీన్ నిర్వహణకు మొత్తం రూ.16.40 లక్షలు పెట్టుబడిగా నిర్ణయించారు. ఇందులో 75 శాతం అంటే రూ.12.30 లక్షల్ని నలుగురు డ్వాక్రా మహిళలు తమ వాటాగా వేసుకోవాలి. మిగిలిన 25 శాతం అంటే రూ.4.10 లక్షల్ని ప్రభుత్వం తరఫున సారా ప్రాజెక్ట్స్ ఫిర్మ్ అనే సంస్థ పెట్టుకుంటుంది. రూ.16.40 లక్షల్లో కంటైనర్‌కు రూ.4.48 లక్షలు, మెషినరీకి రూ.5.82 లక్షలు, సోలార్ పవర్‌కు రూ.4.10 లక్షలు, వర్కింగ్ కేపిటల్ కింద రూ.2 లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంది.

● నెలకు రూ.2.46 లక్షల లాభం వచ్చేలా..

ఒక్కో క్యాంటీన్ నెలవారి టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతి నెలా నికర లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.అల్పాహారం ద్వారా రూ.90 వేలు, టీ నుంచి రూ.1.44 లక్షలు, కాఫీ నుంచి రూ.2.16 లక్షలు, బిర్యానీ ద్వారా రూ.1.35 లక్షలు, వాటర్ బాటిల్స్ ద్వారా రూ.54 వేలు వచ్చేలా ప్లాన్ చేసింది. 24 గంటలూ పనిచేస్తే అనుకున్న లాభాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

● పరోక్షంగానూ ఉపాధి

జిల్లాలో 82 క్యాంటీన్లు ఏర్పాటైతే ఒక్కోదానికి నలుగురు చొప్పున 328 మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారనున్నారు. అలాగే పరోక్షంగా మరో 328 మందికి ఉపాధి కూడా లభిస్తుంది. వచ్చిన లాభంలో 75 శాతం మహిళలు, 25 శాతం ప్రారంభ పెట్టుబడి పెట్టిన సంస్థ తీసుకుంటుంది.

మున్సిపాలిటీ	లక్ష్యం
చిత్తూరు	40
కుప్పం	10
పలమనేరు	10
నగరి	12
పుంగనూరు	10
మొత్తం	82

ఉపాధ్యాయ ఖాళీలపై కసరత్తు

- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ప్రక్రియ
- మొత్తం ఆరు వేల ఖాళీలు చూపే అవకాశం
- త్వరలో బదిలీలు, ఆపై పదోన్నతులు



టీచర్ల వేకెన్సీ గుర్తింపు ప్రక్రియలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, సాంకేతిక నిపుణులు

చిత్తూరు సెంట్రల్, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన త్వరలోనే పెద్దఎత్తున బదిలీలు, పదోన్నతులు జరగనున్నాయి. ఏ ఒక్క పోస్టూ బ్లాక్ చేయకుండా వీటిని చేపట్టే దిశగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.నాలుగు నెలలుగా సాగుతున్న టీచర్ల సీనియారిటీ జాబితా, ఖాళీల గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో శనివారం విద్యాశాఖలో క్లియర్ వేకెన్సీలు చూపేందుకు అధికారులు చిత్తూరు ప్రభుత్వ పాఠశాలలో సమావేశమై కసరత్తు జరిపారు. చిత్తూరు డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, అన్నమయ్య జిల్లా డీవైఈవో లోకేశ్వర రెడ్డి, చిత్తూరు డీవైఈవో ఇందిర, ఏడీ వెంకటేశ్వరరావు ఈ ప్రక్రియను పర్యవేక్షించగా 66మంది ఎంఈవోలు, హెచ్‌ఎంలు ప్రక్రియలో పాలుపంచుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,918 ఖాళీలుండగా, మరో నాలుగు వేల ఖాళీలు చూపే అవకాశం ఉంది. బదిలీలు,ఆపై పదోన్నతులు, మిగిలిన ఖాళీలకు తాజాగా డీఎస్సీ ద్వారా వచ్చే ఉపాధ్యాయులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. క్లియర్ వేకెన్సీ వివరాల ఆధారంగా తొలుత బదిలీలు చేపడతారు. ఆపై 1:2 విధానంలో పదోన్నతుల జాబితా విడుదల చేయనున్నారు.

● ప్రస్తుత ఖాళీల వివరాలు

యాజమాన్యం	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న టీచర్లు	ఖాళీలు
ప్రభుత్వ	723	598	125
ఎంపీ/జడ్పీ	15,552	13,969	1583
మున్సిపల్ కార్పొరేషన్	589	454	135
మున్సిపాలిటీ	508	433	75
	17,372	15,454	1918

బదిలీల ప్రక్రియలో చూపే ఖాళీల వివరాలు

బదిలీ ప్రక్రియలో భాగంగా క్లియర్ వేకెన్సీలను చూపేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పాఠశాల, మండల, డివిజన్, జిల్లాస్థాయుల్లో క్యాడర్లవారీగా ఖాళీలను గుర్తిస్తున్నారు. మరణించిన,వీఆర్‌ఎస్ తీసుకున్న,రిటైరైన ఉపాధ్యాయులతో ఏర్పడిన ఖాళీలు, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న హెచ్‌ఎం స్థానాలు, 8 ఏళ్ళు పూర్తి చేసుకున్న టీచర్ల స్థానాలు, స్టడీ సెలవులపై వెళ్ళిన ఖాళీలు, పోక్సో కేసుల్లో వెళ్లిన వారి స్థానాలను క్లియర్ వేకెన్సీలుగా చూపనున్నారు.

క్యాడర్ వారీగా ఖాళీలు

విద్యాశాఖలో 37 కేడర్లలో టీచర్లు పనిచేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరగక ముందే వివిధ క్యాడర్లలో 1981 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గ్రేడ్-2 హెచ్‌ఎం 90 ఖాళీలు, స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్)- తెలుగు 28, ఉర్దూ 1, తమిళం 1, ఎస్‌ఏ(ఫిజిక్స్) తెలుగు 25, తమిళం 1, ఎస్‌ఏ(బయాలజీ) తెలుగు 63, ఉర్దూ 1, తమిళం 3, ఎస్‌ఏ(సోషల్)తెలుగు 103, ఉర్దూ 5, తమిళం 5, ఎస్‌ఏ-ఇంగ్లీష్ 96, తెలుగు 53, హిందీ 27, ఉర్దూ 14, సంస్కృతం 3, ల్యాంగ్వేజ్ పండిట్లు-తెలుగు 2, హిందీ 3, ఉర్దూ 1, తమిళం 1, ఎస్‌ఏ-స్పెషల్ ఎడ్యుకేషన్ 13, ఫిజికల్ ఎడ్యుకేషన్ 93, పీఈటీ 25, క్రాఫ్టు 3, డ్రాయింగ్ 16, మ్యూజిక్ 5, ఒకేషనల్ 16, పీఎస్-హెచ్‌ఎం తెలుగు 75, ఉర్దూ 1, తమిళం 1, సెకండరీ గ్రేడ్ టీచర్లు- తెలుగు 1039, ఉర్దూ 97, తమిళం 8 ఖాళీలు ఉన్నాయి. వీటితో పాటు ప్రస్తుతం జరుగుతున్న ఖాళీల గుర్తింపు ప్రక్రియ పూర్తయితే మరో నాలుగు వేల ఖాళీలు చూపనున్నారు.



సముద్రతీరంలో నిఘా పెంపు

• 18 తీర ప్రాంత గ్రామాల్లో అప్రమత్తం

కోట మండల సరిహద్దులో మత్స్యకారులకు సూచనలిస్తున్న మెరైన్ ఎస్ఐ శివసౌమ్య, ఏఎస్ఐ రాధ

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో సముద్రతీర గ్రామాలు అప్రమత్తమయ్యాయి. మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా పెంచారు. కోట, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని 18 గ్రామాల్లో కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు మెరైన్ ఎస్ఐ శివసౌమ్య తెలిపారు. బయట వ్యక్తుల సంచారం, సముద్రంలోకి అపరిచిత పడవలు, స్టీమర్ల రాకను గుర్తిస్తే వెంటనే 9392914744 నంబర్‌కు, అదేవిధంగా టోల్‌ఫ్రీ నంబర్ 1093కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

భారత ఆర్మీకి చిన్నారుల ఆర్థికసాయం



తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 10(ఆంధ్రజ్యోతి): భారత ఆర్మీకి చిన్నారులు శనివారం ఆర్థికసాయం చేశారు. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో తమ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకోవడం ఇష్టం లేక తిరుపతికి చెందిన అనిరుధ్ శ్రీరామ్, సుచిత్ర శ్రీఅనన్య, ఆశ్రిత్ శ్రీరామ్ అనే ముగ్గురు చిన్నారులు తమ పుట్టిన రోజుకు అయ్యే ఖర్చును భారత ఆర్మీకి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు తమ తల్లిదండ్రులతో కలిసి శనివారం టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నగదు అందజేశారు. దానిని భారత ఆర్మీకి పంపేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.45 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,635



అమ్మకి మరోపేరే త్యాగం. ఓర్పు, నేర్పు.. అమ్మదనంతో అలవోకగా అలవడే లక్షణాలు. బిడ్డల కోసం జీవితంతో పోరాడే ధీశాలి. భూదేవితో తప్ప అమ్మను మరిక దేనితోనూ పోల్చలేం. అందుకే.. 'తానుండలేని తావులో తనకు బదులుగా దేవుడు అమ్మని సృష్టించాడు' అని చెబుతారు. కని, పెంచిన కష్టం మాత్రమే కాదు.. బిడ్డల బంగారు భవిష్యత్తుకూ అమ్మ రూపశిల్పి. అమ్మ పట్టుదలకూ, ప్రేమకూ, అమ్మకన్న కలలకూ ప్రతిరూపాలే పిల్లలు. అమ్మ తీర్చిదిద్దిన ఈ బిడ్డలు ఐఏఎస్‌లు అయ్యారు. వెంకటేశ్వర్.. తిరుపతి జిల్లాకు పరిపాలనా సారథ్యం వహిస్తున్నారు. మౌర్య తిరుపతి నగర పాలన బాధ్యతల్లో ఉన్నారు. వీరిద్దరు అమ్మల గురించి ఆంధ్రజ్యోతితో పంచుకున్న సంగతులు.. వారి మాటల్లోనే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మ దిద్దిన ఐఏఎస్‌లు



అమ్మ పట్టుదల

• తిరుపతి నగర కమిషనర్ మౌర్య



నా విజయంలో సగం ఆమెదే

అమ్మ జయశ్రీ పెద్దచదవరి కాదు. మాది కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లి. పల్లెలో పుట్టి పెరిగిన అమ్మ.. బిడ్డల కోసం పెద్ద కలలు కనింది. ఆ కలలు నెరవేరడానికి కొండలా నిలబడింది. నా ఐఏఎస్ సాధనయాత్రలో అమ్మ కష్టం.. అమ్మ త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే! నాకు అమ్మంటే ఇష్టం. అమ్మకు చదవంటే ఇష్టం. అమ్మ కళ్లలో మెరుపుకోసం మరింత కష్టపడి చదివేదాన్ని. సివిల్స్ కోసం ఢిల్లీకి వెళితే అమ్మ నాతోపాటు వచ్చేది. ఢిల్లీలో చిన్న అద్దెగదిలో అమ్మా..నేనూ.. ఇద్దరమే ఉండేవాళ్లం. ప్రతి పరీక్షకూ అమ్మ నాతోపాటూ సెంటర్‌కు వచ్చేది. ఇంట్లోనే అన్నం కూరలూ చేసి తెచ్చేది. ఉదయం నుంచి సాయంత్రం దాకా అక్కడే కాసుకుని ఉండేది. సివిల్స్‌కి నాలుగుసార్లు ప్రయత్నించి విఫలమయ్యా. ఇక సాధించగలనా? అన్న అనుమానం కలిగి అసంతృప్తి చెందినప్పుడు.. అమ్మ నాకు బాసటగా నిలచింది. వెన్ను తట్టి ప్రోత్సహించేది. చాలా ధైర్యం చెప్పేది. ఆ తర్వాత హైదరబాద్‌కు వచ్చేశాం. అక్కడ ఒక ఫ్లాట్ తీసుకుని ఐదోసారి సివిల్స్‌కు ప్రయత్నించా. అప్పుడు కూడా అమ్మ ఇల్లొదిలి వచ్చి నాతోపాటు ఉండిపోయింది. ఐదో ప్రయత్నంలో ర్యాంకు సాధించా. నా ఐఏఎస్ ప్రయత్నంలో కష్టం అమ్మదే. ఆ విజయంలో సగం అమ్మకే దక్కుతుంది.

ఇప్పుడూ ఆమే!

ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అమ్మ నాకు ఆసరాగానే ఉంది. విధి నిర్వహణలో ఎక్కువ సమయం బయట ఉండాల్సి ఉంటుంది. ఇప్పుడు కూడా ఇంట్లో ఎక్కువగా అమ్మ ఉంటుంది. మా బాబును ఆమే చూసుకుంటుంది. నాకు స్వేచ్ఛ ఇచ్చింది. విలువలు నేర్పింది. అమ్మ నా మార్గదర్శి కూడా. 62 ఏళ్ల వయస్సులో ఇప్పుడు కూడా ఆమె సలహాలు బాగా ఇస్తారు. ఏదైనా బాధ, సంతోషం కలిగినప్పుడు పెళ్లికి ముందు అమ్మతోనే షేర్ చేసేకునేదాన్ని. పెద్ద రిలీఫ్ అనిపించేది. ఇప్పుడు భర్తతో పంచుకుంటా.

పెళ్లికాక ముందే పుట్టినింటి భారం

అమ్మ పేరు కాశమ్మ. నర్సింగ్ కోర్సు చేశారు. ఇంటి పరిస్థితి అమ్మని పెళ్లి కాక ముందే సౌదీ అరేబియాకు చేర్చింది. అప్పటికి అమ్మ వయసు 19 ఏళ్లట. అక్కడ నర్స్‌గా ఉద్యోగం చేస్తూ అమ్మ నాన్నా అమ్మలకు, తోబుట్టువులకు అండగా నిలిచారు. పెళ్లి తర్వాత కూడా చాలా వరకూ వారి మంచిచెడ్డలు పట్టించుకున్నారు.

చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా!

అమ్మ ఇరవై ఏళ్ల సౌదీ అరేబియాలో ఉద్యోగం చేశారు. పెళ్లయ్యాక, మేము పుట్టాక కూడా అక్కడే కొనసాగారు. ఏడాదికి రెండుసార్లు వచ్చి మమ్మల్ని చూసి వెళ్లేవారు. చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా. నేనే కాదు మా అన్న, అక్కలు అందరికీ ఆ వెలితి ఉండేది. అప్పట్లో అమ్మ మాతో లేకపోవడం వల్ల ఒకటవ తరగతి నుంచే నన్ను హాస్టల్‌లో చేర్చారు. తర్వాత నా చదువంతా అలానే హాస్టల్‌లోనే గడిచింది.



ఆమె కష్టాలూ, త్యాగాలూ వెలకట్టలేను!

మాది పెద్ద కుటుంబం. ఐదుగురు పిల్లలం. ఒక అన్న, ముగ్గురు అక్కల తర్వాత నేను. అంతమందిని చదివించి పెంచి పెద్ద చేయడం అంటే మాటలు కాదు. అమ్మ ఉద్యోగం వదులుకుని వచ్చేశాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. వాటి తీవ్రత, అమ్మ పడిన కష్టాల గురించి అంతకుమించి చెప్పలేను. మా కోసం తను పడిన కష్టాలు, చేసిన త్యాగాలకు వెలకట్టలేను.

అమ్మ కల ఇది!

• తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



మాకోసం కెరీర్‌నే వదులుకున్నారు!

మా కోసం అమ్మ తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను పూర్తిగా వదులుకున్నారు. నేను హైస్కూలు చదువు స్థాయికి వచ్చేసరికి ఎదిగే వయసులో పిల్లలతో గడపాలని, మా మంచి చెడ్డలు చూడాలని సౌదీ అరేబియాలో ఉద్యోగం వదిలిపెట్టేసి వచ్చేశారు. నిజానికి సౌదీలో ఇరవై ఏళ్ల అనుభవం ఉన్నందున ఇక్కడికి వచ్చాక సిటీల్లో ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా మంచి ఉద్యోగంలో చేరే అవకాశం ఉండింది. కేవలం మా కోసమే అమ్మ అలాంటి ప్రయత్నం చేయలేదు. మాతోనే ఉండిపోయి తన కెరీర్‌నే పూర్తిగా వదులుకున్నారు.

అమ్మ కల.. నా ఐఏఎస్

నేను చిన్నప్పటి నుంచీ చదువులో చురుకుగా ఉండేవాడిని. అది గమనించిన అమ్మ.. నువ్వు ఐఏఎస్ చేయాలి అనేది. అది చిన్నపుడే నాలో నాటుకుంది. అమ్మకి ఆ కోరిక ఎందుకు కలిగిందంటే.. 2001లో మా సొంత మండలం కొమరోలు (ప్రకాశం జిల్లా) జడ్పీటీసీ స్థానం బీసీ మహిళలకు రిజర్వు అయింది. బీసీ జనరల్ అయివుంటే నాన్న వెంకటయ్య పోటీ చేసివుండేవారు. మహిళకు రిజర్వు కావడంతో అమ్మ పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచారు. నాన్న కూడా సర్పంచుగా, జట్పీటీసీగా పనిచేశారు. ప్రజాప్రతినిధులు కావడం వల్ల వారికి కలెక్టర్ వంటి ఐఏఎస్ అధికారులను కలిసే అవకాశం ఉండేది. దాంతో నన్ను ఐఏఎస్ ఆఫీసర్‌గా చూడాలన్న ఆశ, పట్టుదల అమ్మకు ఇంకా ఎక్కువైంది. ప్రతి సందర్భంలోనూ ఆ విషయాన్ని గుర్తు చేస్తూ ఉండేవారు. అందుకే మెడిసిన్ పూర్తి చేసినప్పటికీ డాక్టర్‌గా కొనసాగకుండా కేవలం అమ్మకోసమే సివిల్స్ వైపు దృష్టి మళ్లించా. తొలి రెండు ప్రయత్నాలలో ఆలిండియా సర్వీసస్‌కు ఎంపికైనా అమ్మ కోసమే పట్టుదలగా ప్రయత్నించి మూడవసారి ఐఏఎస్ సాధించా. ఆ క్షణం అమ్మ పడిన సంబరం, సంతోషం వర్ణించలేను. తనే ఐఏఎస్ సాధించినట్టు ఫీలయ్యారు. ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరిన రోజు నా కుర్చీలో కూర్చోబెట్టినపుడు అమ్మ కళ్లలోని ఆ మెరుపులు చాలు నా జీవితానికి అనిపించింది. అలాగే రిపబ్లిక్ డే ఉత్సవాలలో రాష్ట్రపతి ప్రతినిధిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం, పోలీసు గౌరవ వందనం స్వీకరించడం వంటి సందర్భాలు ప్రత్యక్షంగా చూసిన అమ్మ గర్వపడిన క్షణాలను ఎప్పటికీ మరచిపోలేను. పిల్లల కోసం ఇన్ని త్యాగాలు చేసిన అమ్మకు సంతోషం కలిగించడం తప్ప ఇంకేం ఇవ్వగలం.. అమ్మ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది.. ఏ బిడ్డలకైనా!

నేటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు తరలి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సెంట్రల్ బస్టాండులో ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి పది నిమిషాలకూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అమరావతి, ఇంద్రా ఏసీ, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలెక్స్ బస్సులను కేటాయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు కోరారు.





తిరుమల నుంచి సారె తీసుకొస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, ఛైర్మన్ బీఆర్ నాయుడు - సారెను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందజేస్తున్న దృశ్యం

గంగమ్మకు వెంకన్న సారె

• తిరువీధులలో ఘనంగా ఊరేగింపు



తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి) : గంగ జాతరను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు టీటీడీ ఆనవాయితీగా అందజేసే మేల్‌చాట్, పసుపు, కుంకుమ (సారె) శనివారం సాయంత్రం ఆలయానికి చేరుకుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు సాయంత్రం 4గంటలకు స్థానిక గోవిందరాజ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు అందజేశారు. అక్కడి నుంచి కర్నాలవీధి, గాంధీరోడ్డు, బండ్ల వీధి, పెద్దకాపు వీధి మీదుగా అమ్మవారి సారె ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు ముందు కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకన్నాయి. పలువురు లయబద్ధంగా నాట్యం చేస్తూ ఊరేగింపునకు జాతర కళను తెచ్చిపెట్టారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, అన్న కుమారుడు శివలు నృత్యం చేసి సందడి చేశారు. కాగా, శనివారం భక్తులు దొరవేషంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కైకాల కులస్థులు దొర వేషాన్ని, చాకలి కులస్థులు మంత్రి వేషాన్ని వేశారు.

• నేడు మాతంగి వేషం

గంగజాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం మాతంగి వేషాన్ని భక్తులు ధరిస్తారు. తలకు పసుపుగుడ్డను జడలా కట్టి కొప్పుముడివేసి దానికి మల్లె పూలను చుట్టుకుంటారు. శరీరమంతా గంధం పూసుకుని తెల్ల చీర, లేదా పసుపు చీర కట్టుకుని రవిక తొడుక్కుంటారు. మెడలో పూలహారం వేసుకుంటారు. ఒడిబాల కట్టుకుని అందులో అక్షింతలు, దువ్వెన, భరిణి, రవిక, పసుపు, కుంకుమలు పెట్టుకుంటారు. మాతంగి వెయ్యికళ్ల దేవతని ముఖానికి, ఒళ్లంతా నల్లని ఎర్రని బొట్లు పెట్టుకుంటారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేస్తూ వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.



• గంగమ్మకు వజ్రపు తిలకం బహూకరణ

తాతయ్యగుంట గంగమ్మకు మంత్ర మహేశ్వరి శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వజ్రపు తిలకాన్ని బహూకరించారు. శనివారం సారె సమర్పించిన ఆమె రూ.2లక్షల విలువైన వజ్రపు తిలకాన్ని ఈవో జయకుమార్‌కు అందజేశారు.

అమ్మవారి వసంతోత్సవాలకు అంకురార్పణ



తిరుచానూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి విష్వక్సేనుడిని ఊరేగింపుగా ఫ్రైడేగార్డెన్‌కు తీసుకెళ్లి పుట్టమన్ను సేకరించారు. రక్షాబంధనం, సేనాపతి ఉత్సవం తర్వాత అంకురార్పణ చేశారు. ఆదివారం నుంచి ఫ్రైడేగార్డెన్‌లో మూడు రోజులూ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారు తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సోమవారం ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. అంకురార్పణ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్; సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వసంతోత్సవ సెట్టింగ్

తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా ఆకర్షణీయంగా సెట్టింగ్‌ను రూపొందించారు. ఏటా అమ్మవారి ఉద్యానవనంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం మూడు రోజులపాటు ఈ వేడుకలు జరుపుతారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. వసంతోత్సవాల మండపాన్ని నందనవనంగా అలంకరించారు. వివిధ రకాల జంతువులు, పక్షులు నిజంగానే ఉన్నాయా అనేంతగా టీటీడీ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది తీర్చిదిద్దారు. వన్యప్రాణుల అరుపులు వినిపించేలా సౌండ్ సిస్టమ్ అమర్చారు. పుష్పాలంకరణను విశేషంగా ఆకట్టుకుంటోంది.



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు

తిరుమల, మే10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులకు శనివారం ఉదయం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు హెల్మెట్లు పంపిణీ చేశారు. విరాళంగా అందిన రూ.5 లక్షల విలువైన 555 హెల్మెట్లు మొదటి విడతగా ఉద్యోగులకు అందజేశారు. ఉద్యోగులకు హెల్మెట్లు విరాళంగా అందజేసేందుకు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కేసీఎస్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకు వచ్చారన్నారు. వీరు మరో ఐదు వేల హెల్మెట్లు అందిస్తారని చెప్పారు. బోర్డు సభ్యుడు శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూతతో మారిన బడిరాత

- రూ.14 లక్షలతో సౌకర్యాల కల్పన
- జిల్లాస్థాయిలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు
- తిరుమలరాజపురం హైస్కూల్ విజయగాథ

తిరుమలరాజపురం అనే గ్రామం పాలసముద్రం మండలంలో, తమిళనాడు సరిహద్దున ఉంటుంది. ఇక్కడ విద్య, వైద్య సదుపాయాలు,రవాణా సౌకర్యాలు అంతంతమాత్రమే. ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం బెంగళూరుకు వలస పోతుంటారు. అలాంటి ఈ ప్రాంతంలో ఓ ప్రభుత్వ పాఠశాల అన్ని హంగులతో ఉత్తమ ఫలితాలను సాధిస్తోంది. తాజాగా ఇక్కడి హెచ్ఎం సుధాకర్ దాతల నుంచి పెద్దఎత్తున విరాళాలు సేకరించి కార్పొరేట్ విద్యాసంస్థకు ఏ మాత్రం తీసిపోకుండా సౌకర్యాలు కల్పించారు. సీసీ కెమెరాలు, సెమినార్ హాలు వంటివి ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ మనకు తారసపడవు. కానీ ఇక్కడ మాత్రం ఆశ్చర్యపరిచేలా అన్ని హంగులూ ఉన్నాయి.

- పాలసముద్రం, ఆంధ్రజ్యోతి


తిరుమలరాజపురం హైస్కూల్




సెమినార్ హాల్ - విద్యార్థుల సెమినార్ కోసం ప్రొజెక్టర్, స్క్రీన్


లైబ్రరీలోని పుస్తకాలు


దాతలు సమకూర్చిన క్రీడా పరికరాలు


ఎల్ఎం డివైజెస్‌తో విద్యార్థులు

● పనిచేసిన ప్రతిచోటా తన మార్కు

1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన సుధాకర్ పనిచేసిన ప్రతి చోటా ప్రజల్ని, స్థానికుల్ని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేస్తుంటారు. ఐదేళ్ల కిందట తిరుమలరాజపురం హైస్కూల్‌కు ఆంగ్ల ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చిన ఆయన, సౌకర్యాల్లో వెనుకబడిన పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. బెంగళూరులో స్థిరపడిన స్థానికులను సంప్రదించి పాఠశాలకు కావాల్సిన సదుపాయాల గురించి చర్చించారు. గతేడాదిలో ఎఫ్ఏసీ హెడ్మాస్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మరింత పట్టుబట్టి సౌకర్యాల కల్పనలో విజయం సాధించారు. ఈ క్రమంలో పలువురు దాతల నుంచి రూ.14 లక్షల విరాళాలు సేకరించి ఉన్నతస్థాయి సౌకర్యాలను కల్పించారు.

224 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో రాష్ట్రంలోనే తొలిసారి ఎట్రియా ఫౌండేషన్ ద్వారా ఎల్ఎం డివైజెస్ ప్రవేశపెట్టారు. అంటే పేపర్ లేకుండానే 8వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఆర్ట్ కెలిగ్రఫీ ద్వారా విద్యార్థుల్లో పోస్టర్ మేకింగ్, చేతిరాత ప్రతిభను మెరుగుపరుస్తున్నారు.

● వినూత్నంగా రాణిస్తున్న విద్యార్థులు

రెండేళ్లుగా జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న నేషనల్ ఓటర్స్ డే, ఎయిడ్స్ డే, సైన్సు డేలలో ఇక్కడి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందుతున్నారు. టెన్త్ ఫలితాల్లో మూడేళ్లుగా మండలంలోని మిగిలిన నాలుగు హైస్కూళ్ల కంటే ఈ పాఠశాల మొదటి స్థానంలో నిలుస్తోంది. పర్యావరణ స్పృహను పెంచేందుకు 'పిక్ ఏ బాటిల్' కార్యక్రమంతో విద్యార్థులకు ప్లాస్టిక్ రీసైకిల్‌పై అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాలను సేకరించి రోడ్డుకు ఇరువైపులా నాటించడంతో సుమారు 2 కిలోమీటర్లు మొక్కల్ని పెంచారు.

స్థానికుల్ని మమేకం చేయడంతోనే..



స్థానిక ప్రజలతో కలిసి పనిచేస్తే పాఠశాల అవసరాలు తీర్చుకోవడమే కాకుండా ఉత్తమ ఫలితాలను కూడా సాధించవచ్చు అనడానికి మా పాఠశాలే నిదర్శనం. స్థానికులు బెంగళూరులో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. వారంతా పండుగలకు సొంత ప్రాంతానికి వచ్చినప్పుడు, వారిని కలిసి పాఠశాల అవసరాలను వివరించి ఒప్పించా. సొంతూర్లో పాఠశాల అభివృద్ధికి సాయం చేసేందుకు బయటి ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారనడానికి మా పాఠశాల అభివృద్ధే ఉదాహరణ.

- సుధాకర్, హెడ్మాస్టర్, తిరుమలరాజపురం హైస్కూల్

దాతల సహకారంతో సమకూరిన వసతులివే..

- బెంగళూరులో స్థిరపడిన తిరుమలరాజపురం గ్రామవాసి సుందరరాజు తన తండ్రి పేరుతో చిన్నస్వామిరాజు ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నారు. ఆయన రూ.4 లక్షలతో పాఠశాలలో సెమినార్ హాల్ నిర్మించడంతోపాటు రూ.లక్షతో సైన్సు, మ్యాథ్స్ ల్యాబ్స్‌కు పరికరాలను అందించారు. విద్యార్థులు సెమినార్స్ ఇవ్వడానికి హాల్‌లో ప్రొజెక్టర్, స్క్రీన్లను ఏర్పాటుచేశారు.
- పాలసముద్రం మండలవాసి బాబురాజు, మోహన్‌రాజు బెంగళూరులో స్థిరపడగా.. తమ 'పద్మావతి వెంకటేశ్వర రూరల్ వెల్ఫేర్ సొసైటీ' ద్వారా రూ.3.50 లక్షల విలువ చేసే లైబ్రరీ ర్యాక్స్ ఏర్పాటుచేశారు. బెంగళూరుకు చెందిన 'కృష్ణదేవరాయ తెలుగు విజ్ఞాన సమితి' వాళ్లు సుమారు 700పుస్తకాలు లైబ్రరీకి అందించారు.ప్రస్తుతం లైబ్రరీలో2,400పుస్తకాలున్నాయి.
- బెంగళూరుకు చెందిన పార్థసారథి మాదిరాజు 'జెన్సిస్ ఐటీ ఇన్నోవేషన్స్' సంస్థ ద్వారా రూ.70వేల విలువైన నాలుగు సీసీ కెమెరాలను పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.
- చిత్తూరుకు చెందిన 'స్పందన ఫౌండేషన్' వారు రూ.35 వేల విలువైన క్రీడా పరికరాలను అందించారు.
- బెంగళూరుకు చెందిన తేజో సుందర్‌రాజు 'ఎట్రియా ఫౌండేషన్' తరఫున రూ.లక్ష విలువ చేసే కంచు సరస్వతీ దేవి విగ్రహాన్ని పాఠశాల ఆఫీసు గదిలో ఏర్పాటుచేశారు.
- చిత్తూరులోని విజయం విద్యా సంస్థల తరఫున చైర్మన్ తేజోమూర్తి.. పవర్ బ్యాకప్ కోసం రూ.30 వేల విలువైన ఇన్వర్టర్‌ను అందించారు.
- వీరితో పాటు ఇంకా పలువురు దాతల సహకారంతో 'ప్రతి గదికీ ఇంటర్నెట్ సౌకర్యం, బాత్రూమ్‌కు పెయింటింగ్, డోర్లకు స్టిక్కరింగ్, పాఠశాల ఆవరణంలో 80 లోడ్ల మట్టి నింపి చదును చేయడం, ప్లాంటేషన్ ఏర్పాటుచేశారు. పాఠశాలలో 50 మీటర్ల సీసీ రోడ్డు, సైకిల్ షెడ్డు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.


సైన్సు ల్యాబులోని పరికరాలు

డైట్‌కు 17 మంది అధ్యాపకులు


అధ్యాపకులతో ప్రిన్సిపాల్ శేఖర్

వెదురుకుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌కు 17 మంది అధ్యాపకులు వచ్చారని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డైట్‌లో వారు ఈ ఏడాది అధ్యాపకులుగా కొనసాగుతారని చెప్పారు. అధ్యాపకుల కొరత లేకుండా డైట్ నిర్వహణ కొనసాగుతోందన్నారు.

మామిడి తోటపై ఏనుగుల గుంపు దాడి


విరిచేసిన చెట్లను చూపుతున్న రైతు శ్రీనివాసులు

బంగారుపాళ్యం, మే 10 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటపై ఏనుగుల గుంపు దాడి చేసి ఘటన బంగారుపాళ్యం మండలంలోని మొగిలి సమీపంలోని గౌనివానిచెరువు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. మొగిలి గ్రామానికి చెందిన శ్రీనివాసులు మామిడి తోటపై ఏనుగుల గుంపు పడి చెట్లను విరిచి.. కాయలను నేలరాల్చాయని బాధిత రైతు శనివారం తెలిపారు. సుమారు టన్ను కాయల వరకు నష్టపోయామన్నారు. ప్రతి ఏడాదీ చేతికందే సమయంలో పంట నష్టం జరుగుతోందని వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

మద్యం అనుకుని పెట్రోల్ తాగాడు

పుంగనూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మద్యం అనుకుని పెట్రోల్ తాగిన సంఘటన శనివారం పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలు... పట్టణంలోని ఎన్ఎస్‌పేటలోని రాంనగర్‌కు చెందిన వాసుదేవాచారి (46) మద్యం మత్తులో ఇంటిలో ఉన్న పెట్రోల్‌ను మద్యం అనుకుని తాగి స్పృహ కోల్పోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వీరజవాన్‌కు ప్రజాసంఘాల ఘన నివాళి



పుంగనూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని పుంగనూరులో ప్రజాసంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మురళీ నాయక్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు అశోక్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నరసింహులు, పి.అయూబ్‌ఖాన్, నరసింహులు, విరూపాక్షి, కుమార్, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, న్యాయవాది శ్రీనివాసులు, కృష్ణానాయక్, రమణ, వెంకటరెడ్డి, గంపల గంగరాజు, కుమార్, కృషాకర్, నాగరాజ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పొడిగాలులు

చిత్తూరు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పొడిగాలులు వీస్తుండడంతో ఎండవేడిమి రోజురోజుకూ పెరుగుతోంది.ఈ నెలాఖరు వరకూ ఎండలు ఇలాగే కొనసాగనున్నట్లు విపత్తు నిర్వహణ సంస్థ చెబుతోంది. శనివారం నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో 39.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. శ్రీరంగరాజపురంలో 38.9, చిత్తూరు, పూతలపట్టు, తవణంపల్లె మండలాల్లో 38.7, పెనుమూరు, వెదురుకుప్పంలో 38.1, సోమలలో 36.7, యాదమరి, గుడిపాల, కార్వేటినగరం, సదుం మండలాల్లో 36.6, శాంతిపురం, పులిచెర్ల, గంగవరం, పెద్దపంజాణి, రొంపిచెర్ల మండలాల్లో 36.5, పుంగనూరు, ఐరాల, చౌడేపల్లె, గుడుపల్లె, పాలసముద్రం మండలాల్లో 36.4, గంగాధరనెల్లూరులో 36.2, బంగారుపాళ్యంలో 35.9, పలమనేరు, వి.కోట మండలాల్లో 33.9, రామకుప్పంలో 31.6, బైరెడ్డిపల్లెలో 33.2, కుప్పంలో 33.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది.

కుప్పంలో 70 మిమీ వర్షం

జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 16 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసాయి. మండలాలవారీగా కుప్పంలో 70, గుడుపల్లెలో 62.8, శాంతిపురంలో 26.4, గంగవరంలో 19.2, పలమనేరులో 16.4, ఐరాలలో 15.2, శ్రీరంగరాజపురంలో 14.2, పెద్దపంజాణిలో 13.2, బైరెడ్డిపల్లెలో 11.8, బంగారుపాళ్యంలో 11.6, రామకుప్పంలో 10.8, పుంగనూరులో 10.4, చౌడేపల్లెలో 8.2, వి.కోటలో 7.4, తవణంపల్లెలో 1.6, యాదమరిలో 1.2 మిమీ వర్షం కురిసింది.

రేపు కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకంతా జిల్లా అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

'ఐవోసీఎల్'లో మాక్ డ్రిల్


మాక్ డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులకు వైద్యసాయం

పూతలపట్టు, మే 10 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం ఎర్రచెరువుపల్లె సమీపాన ఉన్న ఐవోసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్)లో శనివారం పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ యూనిట్ వంటి కీలక ప్రదేశాల్లో ఉగ్రవాదుల దాడులు జరిగినప్పుడు ఉద్యోగులు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, సైరన్‌లు మోగినప్పుడు అనుసరించాల్సిన భద్రతా విధానాలను, బాంబు బెదిరింపుల సమయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు, హెల్త్, ఫైర్ రెస్పాన్స్ టీముల పాత్రలు ఈ మాక్‌డ్రిల్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారు. మానవ వనరుల పనితీరు, అప్రమత్తత స్థాయిలను కూడా అధ్యయనం చేశారు. పారిశ్రామిక సంస్థలు తమ స్థాయికి తగ్గట్టు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులు, ప్యాకెట్లు, పరికరాలను సిబ్బంది తాకకూడదని, వెంటనే పోలీసులకు లేదా బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్యాస్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉండడంతో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, ఎప్పుడు వాడాలి అనే అంశాలపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీలు సాయినాథ్, చిన్నికృష్ణ, పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, స్థానిక ఫైర్ ఆఫీసర్‌తోపాటు ఐవోసీఎల్ గ్యాస్ యూనిట్ చీఫ్ ప్లాంట్ మేనేజర్లు రామారావు, సతీష్, తహసీల్దార్ రమేష్ బాబు, వైద్య, మున్సిపల్, ఎలక్ట్రికల్, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

19 మంది పంచాయతీ కార్యదర్శుల రాక

చిత్తూరు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి గ్రేడ్-2గా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా కొందరిని అదే జిల్లాలో కొనసాగిస్తూ, మరికొందరిని రాయలసీమ జోన్-4 పరిధిలోని వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీచేశారు. దీనిప్రకారం జిల్లాలోనే పనిచేస్తున్న 25 మందికి జిల్లాలోనే పోస్టింగ్స్ కేటాయించారు. రాయలసీమ జిల్లాల్లో పదోన్నతి పొందిన వారిలో 11 మందిని అనంతపురం జిల్లా నుంచి, ఎనిమిది మందిని వైఎస్సార్ కడప జిల్లా నుంచి మన జిల్లాకు కేటాయించారు. కాగా, జిల్లాలో పనిచేస్తున్న లోకమునిని తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు.

వివరాలిలా.. : ఇక్కడ పనిచేస్తున్న 25 మందిని చిత్తూరు జిల్లాకే పరిమితం చేస్తూ పోస్టింగ్స్ ఇచ్చారు. వీరిలో.. ఎస్.దుష్యంత్ రెడ్డి, ఆర్.రెడ్డిప్రకాష్, కె.మోహన్‌కుమార్, ఎం.జి.రమేష్ బాబు, డి.మహబూబ్ బాషా, ఎంకే దుర్గాప్రసాద్, బీఎస్ మోహన్ రామ్‌ప్రసాద్, కె.చంద్రశేఖర్, సి.మనోజ్‌కుమార్, ఎం.నాగభూషణం, ఎస్.హబీబ్, టి.సురేష్ బాబు, కె.మంజునాథ్, బి.భరత్‌కుమార్, జి.అశోక్, పి.చంద్రశేఖర్, ఎం.రామకృష్ణ, ఎం.శేషకుమార్, ఎ.బాలమురళి, బి.లక్ష్మణకుమార్, ఎం.పవన్‌కుమార్, ఎన్.వెంకటరత్నం, ఎం.జరీనాతాజ్, ఎ.జ్ఞానప్రకాష్, బి.చంద్రశేఖర్ ఉన్నారు. ● అనంతపురం జిల్లా నుంచి ఎస్.రామాంజులు, కె.మనోహర్ శర్మ, ఎన్.వి.చంద్రమౌళి, సి.అమర్‌కుమార్, ఎస్.ఆనంద్ కుమార్, జి.శివశంకర్, సి.గురుమూర్తి, డి.రవికుమార్, కె.శ్రీనివాసప్రసాద్, ఎం.సతీష్ బాబు, కె.కేశవమూర్తిలు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ● కడప జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన వారిలో.. హెచ్.శ్రీధర్ కుమార్, ఎస్.రిహాన్, ఎస్.చంద్రశేఖర్, సి.రవీంద్రారెడ్డి, కె.చెన్నకేశవులు, వి.ప్రభుకుమార్, ఎస్.హరిబాబు, జగదీశ్వర్ రెడ్డి ఉన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు


ఏనుగుల గుంపు దాడిలో విరిగిన మామిడిచెట్టు కొమ్మలు

కల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగు రోజులుగా 13 ఏనుగుల గుంపు వందల సంఖ్యలో మామిడిచెట్లను విరిచేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. టన్నుల కొద్దీ మామిడి కాయలను నేలరాలుస్తూ రైతులకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. ఇంత నష్టం జరుగుతున్నా అధికారులు కనీసం పంటల నష్టాన్ని పరిశీలించకపోవడం పట్ల మామిడి రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతం చింతలవంక నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరిన 13 ఏనుగుల గుంపు పాళెం పంచాయతీ కోటపల్లి సమీపానికి చేరుకున్నాయి. కల్లూరులోని రైతులు ప్రవీణ్‌కుమార్, గోపీనాథ్‌కు చెందిన 15 మామిడిచెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా విరిచేసి సుమారు టన్ను మామిడికాయలను నేలరాల్చాయి. కోటపల్లిలోని రైతు వీరభద్ర నాయుడికి చెందిన 2 మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగులు మామిడి కాయలను నేలరాల్చాయి. నేలరాలిన మామిడికాయలను కిలో రూ.4 చొప్పున కూడా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకురావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే పంటలపై ఏనుగులు గుంపు దాడులు కొనసాగుతున్నాయని రైతులు మండిపడుతున్నారు.

వీర జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి

రొంపిచెర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): పాక్ కాల్పుల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్‌కు రొంపిచెర్లలో గ్రామస్తులు నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి, మౌనం పాటించారు. చిన్న వయస్సులోనే దేశంకోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ అమర్ రహే అంటూ వారు నినాదాలు చేశారు.


రొంపిచెర్లలో మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

'జడ్పీ యూనిట్' నూతన కార్యవర్గం

● అధ్యక్షుడిగా సురేష్‌కుమార్ ఏకగ్రీవం



చిత్తూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా పరిషత్ (జడ్పీ) యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి పీఎంఆర్ ప్రభాకర్ తెలిపారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చలపతిరెడ్డి, సుజాత, లక్ష్మీపతి, కార్యదర్శిగా రాజేంద్రన్, సహాయ కార్యదర్శులుగా రూప్‌సాగర్, బాలకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చక్రవర్తి, కోశాధికారిగా వాసుదేవరావు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా గిరిధర్‌రెడ్డి, శశిధర్ చౌదరి, చంద్రశేఖర్‌రెడ్డి, తులసీరామ్, దస్తగిరి సాహెబ్, సుష్మకీర్తి, శ్రీనివాసులు, హరీష్ ఎంపికయ్యారు. పరిశీలకులుగా చెంచురత్నం, చక్రపాణి వ్యవహరించారు.

యుద్ధంలో ఇండియా విజయం సాధించాలి

● లక్ష్మీ నరసింహుడి ఆలయంలో ప్రత్యేకపూజలు



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

కలికిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత సేనలు విజయం సాధించాలని, సరిహద్దుల ప్రజలు సురక్షితంగా ఉండాలని పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం టీడీపీ, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత రక్షణ దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకులు ధనుంజయ నాయుడు, నూర్‌బాషా, బాబు, పార్థసారథి, లోకేష్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగించాలని, శత్రుదేశానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. భారత సైన్యానికి, జవానులకు, దేశ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకూడదని పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

భారత సైన్యానికి మద్దతుగా మానవహారం



జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న సమితి సభ్యులు

గంగవరం, మే 10(ఆంధ్రజ్యోతి): భారత సైన్యానికి మద్దతుగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శనివారం గంగవరం సాయినగర్‌లో మానవహారం నిర్వహించారు. స్థానిక సాయినగర్‌లోని కళామందిరం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా జాతీయ జెండాలను చేత పట్టుకొని, పాకిస్థాన్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశం కోసం సేవ చేస్తున్న సైనికులకు మేము సైతం మద్దతుగా ఉంటామని, అంతిమ విజయం మనదే అని ఆకాంక్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప, గుణశేఖర్, సీతారామయ్య, నరేంద్రబాబు, భార్గవి, దేవేంద్ర, నవ్య తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు మనోధైర్యం కల్పించాలి

పుంగనూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం పోరాటం చేస్తున్న దేశ త్రివిధ దళాలకు మనోధైర్యం కల్పించాలని బీజేపీ నాయకులు శనివారం స్థానిక వెంకటరమణస్వామి, మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. దేశ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వీర జవాన్‌లకు మరింత శక్తి ప్రసాదించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీశ్‌రాజు, మల్లికరాణి, మహేష్‌మొదలియార్, నానబాలకుమార్, రాజారెడ్డి, ప్రసాద్, వెంకటరెడ్డి, పెద్దమరంబాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికోద్యోగులు తదితరులు

పలమనేరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మశాంతి కోసం పలమనేరులో శనివారం రాత్రి మాజీ సైనికోద్యోగులు, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో కేడీసీ విద్యార్థుల ప్రతిభ



కేడీసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ నిరూపించుకున్నట్లు కళాశాల చైర్మన్ శాంతానాగరాజ్ తెలిపారు. బీఎస్సీలో జీ.భవాని 9.30 పాయింట్లు, ఎం.అర్చన 9.02, బీబీఏలో జహర్ష 9.30, ఎం.ప్రతీక్ష 9.0, బీకాంలో పి.నిత్యలక్ష్మి 8.91, బీ.పీ.దివ్యశ్రీ 8.85, బీఎస్సీ (ఎమ్మెస్సీఎస్)లో ఆర్.మహేశ్వరి 8.91, ఎల్.గుణవతి 8.47, బీఎస్సీ (బీజడ్సీ)లో ఎన్.వి.ప్రేమ్ 8.92, కె.ప్రవళిక 8.63 పాయింట్లు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే బీజెడ్‌లో 8 మంది, స్టాటిస్టిక్స్‌లో 3, కస్ట్ కంట్రోల్‌లో 3, మ్యాథ్స్‌లో ఇద్దరు, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్‌లో ఒకరు వందకు వంద మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజ్‌తోపాటు ప్రిన్సిపాల్ డి.సుదర్శన్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఆధార్ అప్డేట్‌కోసం హైదరాబాద్ ప్రయాణం



శకమ్మకు ఆర్థిక సాయం చేస్తున్న కన్నన్

కుప్పం, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఏ పథకం ద్వారా సాయం పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. అయితే కొద్దిగా వయసు మళ్లిన పెద్దలు, వృద్ధులకు ఆధార్ అప్డేషన్ సరిగా కావడంలేదు. బయోమెట్రిక్ వేయడానికి వేలి ముద్రలు సరిగా పడకపోవడం, కనీసం కంటి పాపలు ద్వారానైనా ఐరిష్ గుర్తింపు కూడా పడకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వికలాంగులు, వృద్ధులు ఎన్టీఆర్ పింఛన్ పొందడానికి అనర్హులుగా మిగిలిపోవాల్సి వస్తోంది. కుప్పం పట్టణం కొత్తపేట 14వ వార్డుకు చెందిన శకమ్మకు వయోభారం కారణంగా బయోమెట్రిక్ పడకపోవడంతో ఆధార్ అప్డేషన్ కాలేదు. దీంతో ఎన్టీఆర్ భరోసా పింఛను నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. అయితే హైదరాబాదులోని ఆధార్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదిస్తే ఏదైనా ప్రయోజనం ఉంటుందని సంబంధిత అధికారులు ఆమెకు సలహా ఇచ్చారు. పేదరాలు కావడంతో హైదరాబాదు వెళ్లేంత ఆర్థిక స్తోమత శకమ్మకు లేదు. దీంతో టీడీపీ విస్తరణ విభాగం కమిటీ సభ్యుడు కన్నన్ ముందుకు వచ్చి ప్రయాణానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించారు. దీంతో శకమ్మ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం



ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుప్పం అర్బన్ పీహెచ్‌సీ ఆస్పత్రిలో శనివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. కంటి రోగులకు ఉచితంగా పరీక్షలు జరిపి, 10 మందిని కంటి శస్త్ర చికిత్సలకోసం వైద్యులు సిఫార్సు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎమహేశ్, డైరెక్టర్లు సెల్వం, శివ తేవర్, కృష్ణమూర్తి, శివప్రసాద్, అనిల్, పీఆర్వో చంద్రశేఖర్, విజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

బైరెడ్డిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలో ఉన్న దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన వాహనంపై గంధాన్ని కొలువుదీర్చి మేళతాళాలు, బాణసంచాపేలుళ్లు, కోలాటకోళ్ల జోహార్ల మధ్య పురవీధుల్లో ఊరేగించారు.

హంస వాహనంపై వెంకన్న ఊరేగింపు

సదుం, మే 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూరగమంద గ్రామంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి జరిగిన స్వామి వారి ఊరేగింపులో చెక్కభజనలు కోలాటాలు నిర్వహించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



గంగమ్మ గుడిలో సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ

పలమనేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర ఏర్పాట్లను శనివారం పలమనేరు సీఐ నరసింహరాజు పరిశీలించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్ల ఏర్పాటు, ప్రత్యేక కార్యక్రమాల గురించి ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీధర్‌తో చర్చించారు. అనంతరం సీఐ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్ఐ స్వర్ణతేజ, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో అంగళ్లకు వేలం...

పలమనేరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శివాలయం నుంచి గంగమ్మగుడి వరకు, అమ్మవారిగుడి నుంచి గంగమ్మ గుడి వరకు, గంగమ్మ తోపులో ఉన్న స్థలంలో అంగళ్లు పెట్టుకొనేవారి నుంచి రుసుం వసూళ్లకు దేవదాయ శాఖ అధికారులు శనివారం వేలం నిర్వహించారు. అత్యధికంగా రూ.2.29 లక్షలకు గుత్తేదారులు పాడుకున్నారు. దేవదాయశాఖ అధికారి కమలాకర్, సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, కమిటీ చైర్మన్ శ్రీధర్, సభ్యులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ గుట్టపల్లెకు చెందిన యువకుడు పురుగులమందు తాగి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు కథనం మేరకు వివరాలు... గుట్టపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు పవన్‌కుమార్(21) పుంగనూరులో మారెమ్మ ఎరువుల దుకాణంలో పని చేస్తున్నాడు. పవన్‌కుమార్ దుకాణానికి ఆలస్యంగా రావడం, అధిక సమయం ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు గుర్తించిన దుకాణ యజమాని రెండు రోజుల క్రితం మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. దీంతో పవన్ కుమార్‌ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

పుంగనూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు మోసం చేశాడంటూ ఓ యువతి శనివారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు వివరాలు... మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లె కాంతినగర్‌కు చెందిన ఓ యువతిని అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చింపరపల్లెకు చెందిన శ్రీకాంత్ గత ఏడాదిగా ప్రేమ పేరుతో వెంటపడి నమ్మించి గర్భవతిని చేసినట్లు వాపోయింది. తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో, విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి కూర్మాయి వాసి మృతి

పలమనేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కూర్మాయి గ్రామానికి చెందిన గణేష్(25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పలమనేరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గణేష్ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించి గణేష్ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా ద్రౌపదీ దేవి ఊరేగింపు

గుడుపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామగానిపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్రౌపదీ దేవి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన బకాసుర వధ హరికథాకాలాపన ప్రజలను అలరించింది. మహిళలు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అశ్వ వాహనంపై మృత్యుంజయేశ్వరుడి విహారం



చౌడేపల్లె, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో 9వ రోజు అశ్వ వాహనంపై ఆదిదంపతులు విహరించారు. శనివారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి ప్రత్యేకంగా పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలుగా అన్నం వంశస్థులు వ్యవహరించారు.

ఘనంగా చౌడేశ్వరమ్మ తిమ్మరాయస్వామి ఉత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో చౌడేశ్వరి దేవి, తిమ్మరాయస్వామి

రామకుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఓబ్బిగానిపల్లె లోని చౌడేశ్వరి అమ్మ తిమ్మరాయ స్వామి ఆలయాల వార్షిక ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ, కలశస్థాపన, గణపతి వాస్తు హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాత్రి విద్యుద్దీప పుష్పాలంకృత పల్లకిలో చౌడేశ్వరి దేవి స్వామి ఉత్సవర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు.

మహిళలతోనే సమాజ పురోగతి

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): సమాజ పురోగతి మహిళలతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీ, మండలానికి సంబంధించిన మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక మండల సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగు ప్రాజెక్ట్ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారని, వారు ఆర్థిక సామాజిక పరంగా ఎదిగే అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టుల మహిళలను పలు నైపుణ్యాల్లో వెలికితీసి శిక్షణలు ఇచ్చి ఉపాధి అందిస్తున్నాయని చెప్పారు. ఇందులో భాగంగానే కుప్పం మున్సిపాలిటీ, కుప్పం మండలాల్లో మొత్తం 355 మందికి కుట్టు మిషన్లపై పనిచేసే శిక్షణ ఇస్తున్నామన్నారు. మొత్తం 90 రోజులపాటు శిక్షణ పొందిన మహిళలకు, శిక్షణానంతరం సర్టిఫికెట్లతోపాటు కుట్టు మిషన్ కూడా ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, వారితోపాటు కంప్యూటర్ ఆపరేటర్ కూడా ఉంటారని తెలిపారు. కుట్టు శిక్షణ పొంది స్వయంగా కుట్టు మిషన్ నడపడమే కాక, మరో పదిమందికి ఉపాధినిచ్చేలా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్సెల్వరాజ్, టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయదత్, కౌన్సిలర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

● యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

గంగవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఒక్కరోజు ఉద్యమ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే మనం పోరాటాల ద్వారా అనేక విజయాలు సాధించామన్నారు. అదే స్ఫూర్తితో మన ఉనికి బదులను మనం నిలుపుకొని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు కలసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ఉన్న బదులను యథావిధిగా కొనసాగించాలని, ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు భోధనేతర సిబ్బందిని నియమించి నాణ్యమైన విద్య అందించడానికి ఇప్పుడు అనుసరిస్తున్న రీ స్ట్రక్చరింగ్ ద్వారా ఉపాధ్యాయ సంఘాలు సూచించిన న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జీవీ రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, రెహానా, ప్రసన్నకుమార్, దీనావతి, ఎస్కే బాషా, మునిరత్నం, సీపీ ప్రకాష్, కృష్ణమూర్తి, ఏకాంబరం, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ గానుగచింతలోని చౌడేశ్వరి అమ్మ వారి ఆలయంలో శనివారం ఉదయం నుంచి అమ్మ వారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఊంజలసేవ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతుల మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. అంబారి జగన్ అలంకరించిన పుష్ప పల్లకీ, తొగట వీర క్షత్రియులచే మేలుకొలుపు వధ్యములతో సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధుల్లో అమ్మవారి ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ యువనేత శ్రీరామ్ చిన్నబాబు, వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప, రొంపిచెర్ల సర్పంచ్ ఆర్ ఇబ్రహీంఖాన్, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, తదితర టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ధ్వజారోహణంతో ప్రారంభమైన కల్యాణవెంకన్న బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లపల్లెలో కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు వేదమంత్రోచ్ఛారణల నడుమ ధ్వజారోహణం నిర్వహించి, స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి చిన్నపురం గ్రామానికి చెందిన మునిపాపిరెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రికెట్ పోటీల్లో రాయచోటి విద్యార్థుల విజయం



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన రాయచోటి పాలిటెక్నిక్ విద్యార్థులు

గంగవరం, మే 10(ఆంధ్రజ్యోతి): మదర్‌థెరిసా కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఫైనల్లో అన్నమయ్య జిల్లా రాయచోటి పాలిటెక్నిక్ విద్యార్థులు విజయం సాధించారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక మదర్‌థెరిసా కళాశాలలో నిర్వహించిన ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి మొత్తం 25 క్రికెట్ టీములు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఫైనల్లో రాయచోటి పాలిటెక్నిక్ విద్యార్థులు, వైఎస్సార్ వేంపల్లె డీకెపాల్లెట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల తలపడగా, రాయచోటి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలవగా, వేంపల్లె విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారన్నారు. ఫైనల్లో గెలిచిన రాయచోటి జట్టుకు రూ.20 వేల నగదు, రన్నరప్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామమూర్తి, లోకేష్‌లతోపాటు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా విద్యార్థుల విజయకేతనం

గంగవరం, మే 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన 5వ సెమిస్టర్ ఫలితాల్లో మదర్‌థెరిసా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. బీకాంలో జి.కలైస్వాతి 9.25, వి.వసంత్‌కుమార్ 9.19, కుసుమ 9.15, బీబీఏలో మాహీన్ 9.17, చందు 9.03, బీఎస్సీలో రోహిత్ 9.16, అశ్విని 9.16, సాజిదాబేగం 9.13, వర్షిత 9.02, విష్ణు 9.01, బీసీఏలో తనూజ 9.12, శ్రావణి 8.93 పాయింట్లు సాధించారన్నారు. మొత్తంపైన 265 డిస్టింక్షన్లు, 75 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్‌కుమార్, రాజేంద్రరెడ్డి అభినందించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కుప్పం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీజీ సెల్వం, కె.గణేశ్ పిళ్లై డిమాండ్ చేశారు. కుప్పం పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం పెన్షనర్ల సమావేశం జరిగింది. తొలుత దేశంకోసం ప్రాణత్యాగం చేసిన అగ్నివీర్ మురళీనాయక్, పెన్షనర్ రతయా బేగం మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గణేశ్ పిళ్లై మాట్లాడుతూ తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం స్పందించి పెన్షనర్లకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్, శంకరయ్య, ఇంద్రప్రకాశ్, మునెప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి



నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతి కార్యక్రమాన్ని పుంగనూరులో దళిత సంఘ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పుంగమ్మ చెరువుకట్టపైన గల మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ మాలల అభివృద్ధి కోసం పీవీరావు ఎన్నో కష్టాలు పడ్డారని, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించారని కొనియాడారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీచేశారు. దళిత సంఘ నాయకులు శ్రీనివాసులు, శ్రీను, మంజు, మోహన్, గంగా, శ్రీనాథ్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారం



అనాథ శవానికి అంతిమ సంస్కారం చేస్తున్న పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శనివారం అనాథ శవానికి ఐక్యత హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పలమనేరు రంగబాబు సర్కిల్ వద్ద అనాథ వృద్ధ అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికులు చికిత్స కోసం శుక్రవారం పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి అతడు శనివారం మృతిచెందాడు. పలమనేరు సీఐ నరసింహరాజు సూచనల మేరకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆ అనాథ వ్యక్తి మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రి నుంచి శ్మశాన వాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, శక్తి, ప్రసాద్, మురుగ, హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శని త్రయోదశి పూజలు

రామకుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి తైలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. భక్తులు ఆలయం ఎదుట నువ్వుల దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడే ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, నాగులమ్మ, పద్మావతి, వెంకటేశ్వర స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు అన్నదానం పంపిణీ చేశారు.

ఘనంగా బహదూర్ అలీషాబాబా ఉరుసు



ప్రత్యేక అలంకారాలలో అలీషాబాబా సమాధి

చౌడేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ పీర్ మహమ్మద్ బహదూర్ అలీషా బాబా ఉరుసు శనివారం ఘనంగా జరిగింది. బాబాకు గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు, కవాలి, అన్నదానం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ మండల అధ్యక్షులు మహ్మద్‌అలీ, అమీద్‌ఖాన్, షైదాఖాన్, ఇనాయత్‌బాషా, సయ్యద్ బాషా, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంలో ఇండియా విజయం సాధించాలి

● లక్ష్మీ నరసింహుడి ఆలయంలో ప్రత్యేకపూజలు



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

కల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత సేనలు విజయం సాధించాలని, సరిహద్దుల ప్రజలు సురక్షితంగా ఉండాలని పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం టీడీపీ, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత రక్షణ దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకులు ధనంజయ నాయుడు, నూర్‌బాషా, బారు, పార్థసారథి, లోకేష్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగించాలని, శత్రుదేశానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. భారత సైన్యానికి, భూభాగానికి, దేశ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకూడదని పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

భారత సైన్యానికి మద్దతుగా మానవహారం



జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న సమితి సభ్యులు

గంగవరం, మే 10(ఆంధ్ర జ్యోతి): భారత సైన్యానికి మద్దతుగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శనివారం గంగవరం సాయినగర్‌లో మానవహారం నిర్వహించారు. స్థానిక సాయినగర్‌లోని కళామందిరం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా జాతీయ జెండాలను చేత పట్టుకొని, పాకిస్తాన్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశం కోసం సేవ చేస్తున్న సైనికులకు మేము సైతం మద్దతుగా ఉంటామని, అంతిమ విజయం మనదే అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప, గుణశేఖర్, సీతారామయ్య, నరేంద్రబాబు, భార్గవి, దేవేంద్ర, నవ్య తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు మనోధైర్యం కల్పించాలి

పుంగనూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం పోరాటం చేస్తున్న దేశ త్రివిధ దళాలకు మనోధైర్యం కల్పించాలని బీజేపీ నాయకులు శనివారం స్థానిక వెంకటరమణస్వామి, మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. దేశ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వీర జవాన్‌లకు మరింత శక్తి ప్రసాదించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీశ్‌రాజు, మల్లికారాణి, మణిమొదలియార్, నానబాలకుమార్, రాజారెడ్డి, ప్రసాద్, వెంకటరెడ్డి, పెద్దమరంబాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికోద్యోగులు తదితరులు

పలమనేరు, మే 10(ఆంధ్ర జ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మశాంతి కోసం పలమనేరులో శనివారం రాత్రి మాజీ సైనికోద్యోగులు, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో కేడీసీ విద్యార్థుల ప్రతిభ



కేడీసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ శనివారం విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ నిరూపించుకున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజ్ తెలిపారు. బీఎస్సీలో జి.భవాని 9.30 పాయింట్లు, ఎం.అర్చన 9.02, బీబీఏలో జి.హర్ష 9.30, ఎం.ప్రతీక్ష 9.0, బీకామ్‌లో పి.నిత్యలక్ష్మి 8.91, బీపీ.దివ్యశ్రీ 8.85, బీఎస్సీ (ఎమ్మెస్ సీఎస్)లో ఆర్.భువనేశ్వరి 8.91, ఎల్.గుణవతి 8.47, బీఎస్సీ (బీజడ్సీ)లో ఎస్.వి ఫ్నేష్ 8.92, కె.ప్రళిక 8.63 పాయింట్లు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే ఫిజిక్స్‌లో 8 మంది, స్టాటిస్టిక్స్‌లో 3, కాస్ట్ కంట్రోల్‌లో 3, మ్యాథ్స్‌లో ఇద్దరు, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్‌లో ఒకరు పదికి పది పాయింట్లు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజ్‌తోపాటు ప్రిన్సిపాల్ డి.సుధారాణి, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఆధార్ అప్డేట్‌కోసం హైదరాబాద్ ప్రయాణం



శశమ్మకు ఆర్థిక సాయం చేస్తున్న కన్నన్

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఏ పథకం ద్వారా సాయం పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. అయితే కొద్దిగా వయసు మళ్లిన పెద్దలు, వృద్ధులకు ఆధార్ అప్డేషన్ సరిగా కావడంలేదు. బయోమెట్రిక్ వేయడానికి వేలి ముద్రలు సరిగా పడకపోవడం, కనీసం కంటి పొరలు దెబ్బతినడంతో ఐరిష్ గుర్తింపు కూడా పడకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వితంతువులు, వృద్ధులు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందడానికి అనర్హులుగా మిగిలిపోవాల్సి వస్తోంది. కుప్పం పట్టణం కొత్తపేట 14వ వార్డుకు చెందిన శశమ్మకు వయోభారం కారణంగా బయోమెట్రిక్ పడకపోవడంతో ఆధార్ అప్డేషన్ కాలేదు. దీంతో ఎన్టీఆర్ భరోసా పింఛను నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. అయితే హైదరాబాదులోని ఆధార్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదిస్తే ఏదైనా ప్రయోజనం ఉంటుందని సంబంధిత అధికారులు ఆమెకు సలహా ఇచ్చారు. పేదరాలు కావడంతో హైదరాబాదు వెళ్లేంత ఆర్థిక స్తోమత శశమ్మకు లేదు. దీంతో టీడీపీ విస్తరణ విభాగం కమిటీ సభ్యుడు కన్నన్ ముందుకు వచ్చి ప్రయాణానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించారు. దీంతో శశమ్మ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం



ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుప్పం, మే 10 (ఆంధ్ర జ్యోతి): కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుప్పం అర్బన్ పీఈఎస్ ఆస్పత్రిలో శనివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. కంటి రోగులకు ఉచితంగా పరీక్షలు జరిపి, 10 మందిని కంటి శస్త్ర చికిత్సలకోసం వైద్యులు సిఫార్సు చేశారు. లయన్స్ క్లబ్ అడ్వైజర్ ఎ.మహేశ్, డైరెక్టర్లు సెల్వం, శివ తేవర్, కృష్ణమూర్తి, శివప్రసాద్, అనిల్, పీఆర్వో ధనశేఖర్, విజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

బైరెడ్డిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలో వున్న దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన వాహనంపై గంధాన్ని కొలువుదీర్చి మేళతాళాలు, బ్యాండువాయిద్యాలు, కొల్లంపకీర్ల జోహార్ల మధ్య పురవీధుల్లో ఊరేగించారు.

హంస వాహనంపై వెంకన్న ఊరేగింపు

సదుం, మే 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూరగమంద గ్రామంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి జరిగిన స్వామి వారి ఊరేగింపులో చెక్కభజనలు కోలాటాలు నిర్వహించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



గంగమ్మ గుడిలో సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ

పలమనేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర ఏర్పాట్లను శనివారం పలమనేరు సీఐ నరసింహరాజు పరిశీలించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్ల ఏర్పాట్లు, ప్రత్యేక కార్యక్రమాల గురించి ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీధర్‌తో చర్చించారు. అనంతరం సీఐ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్ఐ స్వర్ణతేజ, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో అంగళ్లకు వేలం...

పలమనేరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శివాలయం నుంచి గంగమ్మగుడి వరకు, మారెమ్మగుడి నుంచి గంగమ్మ గుడి వరకు, గంగమ్మ తోపులో ఉన్న స్థలంలో అంగళ్లు పెట్టుకొనేవారి నుంచి రుసుం వసూళ్లకు దేవదాయ శాఖ అధికారులు శనివారం వేలం నిర్వహించారు. అత్యధికంగా రూ.2.29 లక్షలకు గుత్తేదారులు పాడుకున్నారు. దేవదాయశాఖ అధికారి కమలాకర్, సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, కమిటీ చైర్మన్ శ్రీధర్, సభ్యులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మే 10(ఆంధ్ర జ్యోతి): పుంగనూరు మండలం భీమగాని పల్లె పంచాయతీ గుట్టపల్లెకు చెందిన యువకుడు పురుగులమందు తాగి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలు... గుట్టపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు పవన్‌కుమార్(21) పుంగనూరులో మారెమ్మ ఎరువుల దుకాణంలో పని చేస్తున్నాడు. పవన్‌కుమార్ దుకాణానికి ఆలస్యంగా రావడం, అధిక సమయం ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు గుర్తించిన దుకాణ యజమాని రెండు రోజుల క్రితం మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. దీంతో పవన్ కుమార్‌ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

పుంగనూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు మోసం చేశాడంటూ ఓ యువతి శనివారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు వివరాలు... మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లె శాంతి నగర్‌కు చెందిన ఓ యువతిని అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చింపరపల్లెకు చెందిన శ్రీకాంత్ గత ఏడాదిగా ప్రేమ పేరుతో వెంటపడి నమ్మించి గర్భవతిని చేసినట్లు వాపోయింది. తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో, విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.


పురుగుల మందు తాగి కూర్మాయి వాసి మృతి

పలమనేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కూర్మాయి గ్రామానికి చెందిన గణేష్(25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పలమనేరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గణేష్ జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించి గణేష్ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా ద్రౌపదీ దేవి ఊరేగింపు

గుడుపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామగానిపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్రౌపది దేవి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన బకాసుర వధ హరికథాలాపన ప్రజలను అలరించింది. మహిళలు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అశ్వ వాహనంపై మృత్యుంజయేశ్వరుడి విహారం



చౌడేపల్లె, మే 10(ఆంధ్ర జ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో 9వ రోజు అశ్వ వాహనంపై ఆదిదంపతులు విహరించారు. శనివారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి ప్రత్యేకంగా పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులుగా అన్నం వంశస్థులు వ్యవహరించారు.

ఘనంగా చౌడేశ్వరమ్మ తిమ్మరాయస్వామి ఉత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో చౌడేశ్వరి దేవి, తిమ్మరాయస్వామి

రామకుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉప్పిగానిపల్లెలోని చౌడేశ్వరి అమ్మ తిమ్మరాయ స్వామి ఆలయాల వార్షిక ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ, కలశ స్థాపన, గణపతి వాస్తు హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాత్రి విద్యుద్దీప పుష్పాలంకృత పల్లకిలో చౌడేశ్వరి దేవి స్వామి ఉత్సవర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు.

మహిళలతోనే సమాజ పురోగతి

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): సమాజ పురోగతి మహిళలతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీ, మండలానికి సంబంధించిన మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక మండల సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగు ప్రాజెక్ట్ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారని, వారు ఆర్థిక సామాజిక పరంగా ఎదిగే అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టులు మహిళల్లోని నైపుణ్యాన్ని వెలికితీసే శిక్షణలను ఉచితంగా అందిస్తున్నాయని చెప్పారు. ఇందులో భాగంగానే కుప్పం మున్సిపాలిటీ, కుప్పం మండలాల్లో మొత్తం 355 మందికి కుట్టు మిషన్లపై పనిచేసే శిక్షణ ఇస్తున్నామన్నారు. మొత్తం 90 రోజులపాటు శిక్షణ పొందిన మహిళలకు, శిక్షణానంతరం సర్టిఫికెట్‌తోపాటు కుట్టు మిషన్ కూడా ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించామని, వారితోపాటు కంప్యూటర్ ఆపరేటర్ కూడా ఉంటారని తెలిపారు. కుట్టు శిక్షణ పొంది స్వయంగా కుట్టు మిషన్ నడపడమే కాక, మరో పదిమందికి ఉపాధినిచ్చేలాగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వి.సెల్వరాజ్, టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయదత్, కౌన్సిలర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

● యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

గంగవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ కలసి రావాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఒక్కరోజు ఉద్యమ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మనం పోరాటాల ద్వారా అనేక విజయాలు సాధించామన్నారు. అదే స్ఫూర్తితో మన ఊరి బడులను మనం నిలుపుకొని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి కలసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ఉన్న బడులను యథావిధిగా కొనసాగించాలని, ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు బోధనేతర సిబ్బందిని నియమించి నాణ్యమైన విద్య అందించడానికి ఇప్పుడు అనుసరిస్తున్న రీ స్ట్రక్చరింగ్ ద్వారా ఉపాధ్యాయ సంఘాలు సూచించిన న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎన్ నాయుడు, జీవీ రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, రెహానా, ప్రసన్నకుమార్, దీనావతి, ఎస్వీ బాష, మునిరత్నం, సీపీ ప్రకాష్, కృష్ణమూర్తి, ఏకాంబరం, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలోని చౌడేశ్వరి అమ్మ వారి ఆలయంలో శనివారం ఉదయం నుంచి అమ్మ వారికి విశిష్ట పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఊంజలసేవ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతుల మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది, అంబూరి జగన్ అలంకరించే పుష్ప పల్లకీ, తొగట వీర క్షత్రియులచే మేలుకొలుపు పద్యములతో సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధుల్లో అమ్మవారి ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ యువనేత శ్రీరామ్ చిన్నబాబు, వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప, రొంపిచెర్ల సర్పంచి ఆర్ ఇబ్రహీంఖాన్, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, తదితర టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.


ధ్వజారోహణంతో ప్రారంభమైన కల్యాణవెంకన్న బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించి, స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి చిన్నపురం గ్రామానికి చెందిన మునిపాపిరెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రికెట్ పోటీల్లో రాయచోటి విద్యార్థుల విజయం



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన రాయచోటి పాలిటెక్నిక్ విద్యార్థులు

గంగవరం, మే 10(ఆంధ్రజ్యోతి): మదర్‌థెరీసా కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఫైనల్లో అన్నమయ్య జిల్లా రాయచోటి పాలిటెక్నిక్ విద్యార్థులు విజయం సాధించారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో నిర్వహించిన ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి మొత్తం 25 క్రికెట్ టీములు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఫైనల్లో రాయచోటి పాలిటెక్నిక్ విద్యార్థులు, వైఎస్సార్ వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు తలపడగా, రాయచోటి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలవగా, వేంపల్లె విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారన్నారు. ఫైనల్లో గెలిచిన రాయచోటి జట్టుకు రూ.20 వేలు నగదు, రన్నరప్ జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామమూర్తి, లోకేష్‌లతోపాటు పలు జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా విద్యార్థుల విజయకేతనం

గంగవరం, మే 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ విడుదల చేసిన 5వ సెమిస్టర్ ఫలితాల్లో మదర్‌థెరిసా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. బీకామ్‌లో డి.కరిష్మాతాజ్ 9.25, వి.వసంత్‌కుమార్ 9.19, కుసుమ 9.15, బీబీఏలో మాహీన్ 9.17, చందు 9.03, బీఎస్సీలో రోహిణి 9.16, అశ్విని 9.16, సాజిదాబేగం 9.13, వర్షిత 9.02, విష్ణు 9.01, బీసీఏలో తనూజ 9.12, శ్రావణి 8.93 పాయింట్లు సాధించారన్నారు. మొత్తంపైన 265 డిస్టింక్షన్లు, 75 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్‌కుమార్, రాజేంద్రరెడ్డి అభినందించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

కుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనని కుప్పం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీజీ.సెల్వం, కె.గణేశ్ పిళ్లై డిమాండ్ చేశారు. కుప్పం పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం పెన్షనర్ల సమావేశం జరిగింది. తొలుత దేశంకోసం ప్రాణత్యాగం చేసిన అగ్నివీర్ మురళీనాయక్, పెన్షనర్ రజియా బేగం మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గణేశ్ పిళ్లై మాట్లాడుతూ తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం స్పందించి పెన్షనర్లకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్, శంకరయ్య, ఇంద్రప్రకాశ్, మునెప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి



నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతి కార్యక్రమాన్ని పుంగనూరులో దళిత సంఘ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పుంగమ్మ చెరువుకట్టపైన గల మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ మాలల అభివృద్ధి కోసం పీవీరావు ఎన్నో కష్టాలు పడ్డారని, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించారని కొనియాడారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీచేశారు. దళిత సంఘ నాయకులు శ్రీనివాసులు, శ్రీను, మంజు, మోహన్, గంగా, శ్రీనాథ్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారం



అనాథ శవానికి అంతిమ సంస్కారం చేస్తున్న పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు, మే 10 (ఆంధ్ర జ్యోతి): పలమనేరులో శనివారం అనాథ శవానికి ఇక్కడి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పలమనేరు రంగబాబు సర్కిల్ వద్ద అనాథ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికులు చికిత్స కోసం శుక్రవారం పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించిన అతడు శనివారం మృతిచెందాడు. పలమనేరు సీఐ నరసింహరాజు సూచనల మేరకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆ అనాథ వ్యక్తి మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రి నుంచి శ్మశాన వాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, శక్తి, ప్రసాద్, మురుగ, హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శని త్రయోదశి పూజలు

రామకుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివాలయంలోని శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి తైలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. భక్తులు ఆలయం ఎదుట నువ్వుల దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకొని స్వామి వారిని దర్శించుకొన్నారు. అక్కడే ఉన్న వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, నాగులమ్మ, పద్మావతి, వేంకటేశ్వర స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా బహదూర్ అలీషాబాబా ఉరుసు



ప్రత్యేక అలంకారంలో అలీషాబాబా సమాధి

చౌడేపల్లె, మే 10 (ఆంధ్ర జ్యోతి): దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ పీర్ మషాయఖ్ బహదూర్ అలీషా బాబా ఉరుసు శనివారం ఘనంగా జరిగింది. బాబాకు గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు, కవాలి, అన్నదానం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ మండల అధ్యక్షులు మహ్మద్‌గని, అమీద్‌ఖాన్, సైద్‌ఖాన్, ఇనూబ్‌సాబ్, సయ్యద్ బాషా, షారుక్ తదితరులు పాల్గొన్నారు.